సాక్షి
జనగామ

శుక్రవారం । 7 । మార్చి । 2025



రాములోరికి 'గోటి తలంబ్రాలు'
వరంగల్ బ్యాంక్‌కాలనీలోని మహిళలు భక్తి శ్రద్ధలతో శ్రీరామ కీర్తనలు ఆలపిస్తూ వరి గింజలను గోటితో ఒలిచి తలంబ్రాలుగా తయారు చేస్తున్నారు. - 8లో



ఆర్టీఏపై విజిలెన్స్ నిఘా
వరంగల్ రవాణా శాఖ కార్యాలయంలో వాహనదారులకు అందించే సేవలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా వేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం $35^0/19^0$

వాతావరణం
ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోత అధికమవుతుంది. రాత్రి పూట చలి తీవ్రత తగ్గుతుంది.



ఇఫ్తార్	సహర్
శుక్ర 6:30	శని 5:08

రంజాన్ వేళలు

ఇంకా నిక్కరేనా..!

ప్యాంట్ కావాలంటున్న విద్యార్థులు
- స్కూల్ యూనిఫాం డిజైన్లు విడుదల చేసిన సర్కారు
- ఆరు.. ఏడు తరగతులకు నిక్కర్లే..
- మహిళా సంఘాలకు స్టిచ్చింగ్ బాధ్యతలు
- జిల్లాకు 68వేల జతలు అవసరం



జనగామ: నిక్కర్ వేసుకునే స్టేజ్ దాటిపోయింది.. ప్యాంట్ కావాలి.. ప్రభుత్వం పునరాలోచించాలి అంటూ సర్కారు స్కూళ్లలో చదివే విద్యార్థులు విన్నవించుకుంటున్నారు. ఈ మేరకు నిక్కర్‌కు బదులు ప్యాంట్ స్టిచ్చింగ్ కోసం క్లాత్ పంపించాలని ఎంఈఓలు డీఈఓలకు అర్జీ పెట్టుకుంటున్నారు. సర్కారు స్కూళ్ల విద్యార్థులకు డ్రెస్‌కోడ్ ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా రెండు జతల దుస్తులను అందిస్తోంది. ఈసారి డిజైన్‌లో పలు మార్పులు తీసుకువచ్చి.. స్టిచ్చింగ్‌ను సరళీకృతం చేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు 2025–26 నూతన విద్యా సంవత్సరంలో ఉచితంగా పంపిణీ చేసే యూనిఫాంలో పలు మార్పులు తీసుకువస్తూ తెలంగాణ సర్కారు నిర్ణయం తీసుకుంది. స్కూళ్లలో ధనిక, పేద తారతమ్యం లేకుండా విద్యార్థులంతా ఒకటే అనే భావన కల్పించడంతో పాటు అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు ఉచిత దుస్తుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రతి ఏటా 1 నుంచి 10వ తరగతి(కేజీబీవీ, మోడల్ గురుకులాలు, ఇంటర్ సహా) వరకు చదువుకునే పిల్లలకు రెండు జతల దుస్తులు అందిస్తున్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు కలిపి 369 ఉండగా 34,053 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి రెండేసి జతల చొప్పున 68 వేల యూనిఫాంలు అవసరం. ఏటా వేసవి సెలవులకు ముందుగానే విద్యార్థుల కొలతలు తీసుకుని దుస్తులు సిద్ధం చేసి పాఠశాలల పునఃప్రారంభం రోజు అందజేయడం ఆనవాయితీ. డీఈఓ రమేశ్ ఆధ్వర్యాన విద్యార్థుల కొలతలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. యూనిఫాం షర్టు భుజాలపై పట్టీలు, ఈజీ కుట్టు ఉండేలా మార్పులు చేశారు. సమగ్ర శిక్ష పర్యవేక్షణలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన మహిళా సంఘాలకు స్టిచ్చింగ్ బాధ్యతలు అప్పగించారు.

నిక్కర్‌పై విద్యార్థుల అలక..
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం రెండేసి జతల యూనిఫాం అందిస్తోంది. ఇందులో 6, 7 తరగతుల పిల్లలకు నిక్కర్ అందజేయాలని నిర్ణయం తీసుకుంది. అయితే.. ఐదవ తరగతి వరకే పిల్లలం.. 6కు అప్‌గ్రేడ్ అవుతున్నా ఇంకా నిక్కరేనా అంటూ పలువురు విద్యార్థులు అలకబూనుతున్నారు. గత ఏడాది కూడా రెండు నిక్కర్ల కోసం ప్రభుత్వం క్లాత్ పంపించగా పలు పాఠశాలల్లో పిల్లల అభిప్రాయాల మేరకు రెండూ కలిపి ఒకే ప్యాంట్ స్టిచ్చింగ్ చేయించారు. ఆ సమయంలో అన్ని మండలాల నుంచి ప్యాంట్ కోసం క్లాత్ పంపించాలని విజ్ఞాపనలు పంపినా.. ఈసారి కూడా నిక్కర్ డిజైన్ నమూనాను విడుదల చేశారు. దీంతో పిల్లల నుంచి వ్యతిరేకత రావడంతో ఎంఈఓలు డీఈఓలకు ప్యాంట్ క్లాత్ కోసం ప్రతిపాదనలు పంపించాలని అర్జీ పెట్టుకుంటున్నారు.

ప్యాంట్ క్లాత్ కోసం అర్జీ..



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఒకే డ్రెస్ కోడ్ ఉండాలనే ఉద్దేశంతో యూనిఫాం నమూనా విడుదల చేసింది. ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు ప్యాంటుకు బదులు నిక్కర్లు కుట్టించాలని ఆదేశించింది. ప్యాంటు కోసం ప్రతిపాదనలు పంపించాలని అర్జీ పెట్టాము. గత ఏడాది ఆరు, ఏడు తరగతుల విద్యార్థుల విజ్ఞప్తి మేరకు నిక్కర్లకు బదులు ఒక్కో ప్యాంట్ స్టిచ్చింగ్ చేసి అందించాం.

- ఇర్రి వెంకట్‌రెడ్డి, ఎంఈఓ, బచ్చన్నపేట

ప్యాంట్ ఇస్తే బాగుంటుంది..



నా వయసు 12 సంవత్సరాలు. 7వ తరగతికి అప్‌గ్రేడ్ కాబోతున్నాను. ఇంకా నిక్కర్లేనా. ప్యాంట్ ఇస్తే బాగుంటుంది. 4, 5 తరగతుల్లోనే ప్యాంట్లు వేసుకుని బడికి వస్తున్నారు. మేము నిక్కర్లు వేసుకుంటే ఏం బాగుంటుంది.

- రాగూర్, 7వ తరగతి, యూపీఎస్, దబ్బకుంటపల్లి(బచ్చన్నపేట)

నిక్కర్ వేసుకోవాలంటే ఇబ్బందిగా ఉంది..



నేను 6వ తరగతి చదువుతున్నాను. ప్రభుత్వం రెండు జతల దుస్తులు ఉచితంగా ఇస్తోంది. కొంతమంది పిల్లలు ప్యాంట్లు వేసుకుంటున్నారు. మేము 11 ఏళ్లు దాటినా నిక్కర్ వేసుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. నాకు నిక్కర్‌కు బదులు రెండు ప్యాంట్లు ఇస్తే బాగుంటుంది.

- బి.దీపక్, 6వ తరగతి, పడమటికేశ్వాపూర్

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చిల్పూరు: చిల్పూరుగుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి 8.30 గంటలకు తొలక్కం కార్యక్రమంతో ప్రారంభం అయ్యాయి. ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ చేపట్టిన ఈ వేడుకలకు అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ హాజరయ్యారు. ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి, తహసీల్దార్ సరస్వతి, జూనియర్ అసిస్టెంట్ మోహన్, వీరన్న, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఎత్తివేత

జనగామ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఎత్తివేసినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో జనవరి 29 నుంచి అమలులోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తన నియమావళి కింద ఉన్న ఆంక్షలను తొలగిస్తున్నట్లు వెల్లడించారు.

సాగునీరు విడుదల చేయాలి



జనగామ: జనగామ నియోజకవర్గంలో యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలను కాపాడేందుకు రిజర్వాయర్ల ద్వారా సాగునీరు విడుదల చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డిని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం వారు హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో ఆయకట్టు స్థిరీకరణ, నీటి విడుదల సమయంలో జాప్యాన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు పేర్కొన్నారు.

పంపింగ్‌లో నిర్లక్ష్యం వద్దు



నర్మెట: రిజర్వాయర్లలోని నీరు ఎగువ ప్రాంతాలకు సకాలంలో పంపింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలి.. నిర్లక్ష్యం చేయొద్దని ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ వేణుమాధవ్ అన్నారు. మండలంలోని బొమ్మకూర్, గండిరామారం పంప్ హౌస్‌లను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. వాటి పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. విధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

అంబులెన్స్‌ల తనిఖీ



జనగామ: జిల్లాలోని 108, 102, 1962 అంబులెన్స్ వాహనాలను జీవీకే ఈఎంఆర్‌ఐ హెడ్ సత్యనారాయణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌ల్లో టెక్నాలజీ వినియోగం, మెడికల్ పరికరాల పనితీరు, మందుల స్టాక్, కాలపరిమితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్‌కాల్ వచ్చిన వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాలని చెప్పారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేలా అంకితభావంతో పని చేయాలని అన్నారు. ఈ సందర్భంగా వేసవిలో అందించాల్సిన సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో నల్లగొండ ఉమ్మడి ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్, జనగామ జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సెకండియర్ పరీక్షలు ప్రారంభం



ప్రెస్టేన్ కళాశాల వద్ద హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

- మొదటి రోజు 97.8 శాతం హాజరు

జనగామ రూరల్: జిల్లాలో ఇంటర్మీడియట్ సెకండియర్ పబ్లిక్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. 4,185 మంది విద్యార్థులకు 4,092 మంది (97.8 శాతం) పరీక్ష రాసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి జితేందర్ రెడ్డి తెలిపారు. జనరల్ కోర్సుల విద్యార్థులు 3,137 మందికి 3,094 మంది, ఒకేషనల్ 1,058 మందికిగాను 938 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం
- గోవర్ధనగిరి సమీపంలో సభాస్థలి పరిశీలన



గోవర్ధనగిరి సమీపంలో సభ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల16న స్టేషన్‌ఘనపూర్ పర్యటనకు రానున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఈ మేరకు కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి సంబంధిత అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ.. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి మంజూరైన రూ.816 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. మహిళా సాధికారత దిశగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సౌర విద్యుత్ ప్లాంట్, పెట్రోల్ బంక్‌ల శంకుస్థాపనకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎం పర్యటన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, ఏసీపీ భీంశర్మ, డీఆర్డీఓ వసంత, డీఎంహెచ్‌ఓ మల్లికార్జునరావు, డీపీఓ స్వరూప, హౌసింగ్ పీడీ మాత నాయక్, విద్యుత్ ఎస్‌ఈ వేణు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభాస్థలి పరిశీలన
రఘునాథపల్లి: సీఎం పర్యటన నేపథ్యంలో మండలంలోని గోవర్ధనగిరి సమీపాన ఏర్పాటు చేయనున్న సభాస్థలిని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అధికారులు గురువారం పరిశీలించారు. సభకు ఈ స్థలం అనువుగా ఉంటుందా..? వేదిక ఎక్కడ ఏర్పాటు చేయాలి.. పార్కింగ్ తదితర అంశాలపై అధికారులు, నాయకులతో చర్చించారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఉంటేనే అనుమతి

- మార్చి 31 వరకు 25 శాతం ఫీజు రాయితీ
- సదస్సులో కలెక్టర్ రిజ్వాన్ బాషా



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: ఎల్‌ఆర్‌ఎస్ ఉన్న స్థలాలకు మాత్రమే ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు లభిస్తాయని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో పురపాలిక ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ విక్రయదారులకు ఎల్‌ఆర్‌ఎస్‌పై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈనెల 31వ తేదీలోగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించి 25 శాతం రాయితీ పొందాలని సూచించారు. జిల్లా నుంచి 62వేల అప్లికేషన్లు రాగా మున్సిపాలిటీ పరిధిలో 16వేలు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 3వేల దరఖాస్తులు పరిష్కరించామని చెప్పారు. అనధికార వెంచర్లలో కొనుగోలు చేసి, 10 శాతం ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేసుకున్న వినియోగదారులు మిగతా వాటిని కూడా రిజిస్ట్రేషన్ చేసుకుని ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 25 శాతం రాయితీ పొందాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై సందేహాలను నివృత్తి చేయడానికి మున్సిపాలిటీ, కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామని, 9948187334, 8978207205 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఫోన్ల ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ ఎస్‌ఎంఎస్‌లు రాకుంటే హెల్ప్‌డెస్క్‌ల ద్వారా సమాచారం పొందవచ్చని, దరఖాస్తు తిరస్కరణకు గురైతే ఫీజులో 10 శాతం మినహాయించి మిగతా సొమ్ము తిరిగి ఇస్తామని వివరించారు. సదస్సులో ఆర్డీఓ గోపీరాం, డీటీసీపీఓ వీరస్వామి, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ కమిషనర్లు వెంకటేశ్వర్లు, రవీందర్, సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్‌కు 64 ప్రాజెక్టులు

- జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ
- ఒక్కో ప్రాజెక్టుకు రూ.10వేలు
- జిల్లా సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శనకు సిద్ధం



జనగామ: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల్లో సృజనాత్మకత, వినూత్న ఆలోచనలను పెంపొందించేందుకు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ 2024–25 సంవత్సరానికి నిర్వహించిన 'ఇన్ స్పైర్ మనక్' ప్రాజెక్టుల ప్రదర్శనల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. గత ఏడాది జిల్లా నుంచి 350 ప్రాజెక్టుల వరకు ఆన్‌లైన్ ద్వారా(నమూనా వీడియో/ప్రాజెక్టు పనితీరును వివరిస్తూ) విద్యార్థులు కేంద్రానికి పంపించారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రాజెక్టులను పరిశీలించి ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపిక చేసి జాబితా విడుదల చేశారు. ఇందులో జిల్లా నుంచి 64 మంది ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికయ్యారు. ఎంపికైన ప్రాజెక్టులను జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా కేంద్రం ఒక్కో ప్రాజెక్టుకు రూ.10వేల చొప్పున విద్యార్థి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. జిల్లా స్థాయి ప్రదర్శన తర్వాత ఉత్తమంగా నిలిచిన వాటిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో మేటిగా ఉన్నవాటిని న్యాయ నిర్ణేతలు జాతీయ స్థాయికి ఎంపిక చేయనున్నారు.

సంతోషంగా ఉంది



రైతులు పొలాల వద్ద కరెంటు షార్ట్‌సర్క్యూట్‌కు గురికాకుండా యంత్రం తయారు చేయాలనే ఆలోచన వచ్చింది. ఆ ఐడియాను పాఠశాలలో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయగా సైన్స్ టీచర్ జిల్లా ఇన్‌స్పైర్‌కు పంపారు. జిల్లా స్థాయికి ఎంపికవడం సంతోషంగా ఉంది.

- గుర్రం అక్షయ, 9వ తరగతి, తిగుడు

మూడు ఎగ్జిబిట్లు పంపించాం..



మండలంలోని తిగుడు ఉన్నత పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం మూడు ఎగ్జిబిట్లు పంపించాం. 2025 జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. అందులో 9వ తరగతికి చెందిన గుర్రం అక్షయ 'ఫార్మర్స్ లైఫ్ సేవింగ్స్ ఏసీ కరెంట్ డిటెక్టర్', 8వ తరగతికి చెందిన గడిపెల్లి అక్షిత 'స్మార్ట్ స్ట్రీట్‌లైట్స్ సిస్టం', 7వ తరగతికి చెందిన మరో విద్యార్థి 'మోడ్రన్ బల్క్ కార్ట్' ఎగ్జిబిట్లు ఉన్నాయి. వీటిని జిల్లా స్థాయిలో ప్రదర్శించాలి.

- డి.శ్రవణ్‌కుమార్, ఫిజికల్‌సైన్స్ టీచర్, జఫర్‌గఢ్

రంజాన్ మాసం పవిత్రమైనది

- డీసీపీ రాజమహేంద్రనాయక్




ఇఫ్తార్ విందులో పాల్గొన్న డీసీపీ తదితరులు

జనగామ రూరల్: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. జిల్లా కేంద్రం గిర్నిగడ్డలోని ఏక్ మినార్ మక్కా మసీదులో రంజాన్ సందర్భంగా మహమ్మద్ జమాల్ షరీఫ్ ఆధ్వర్యాన గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ పార్టీలో ఏసీపీ పండారి నితిన్ చేతన్, సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై రాకేశ్‌తో కలిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. మానవాళికి శాంతిని చేకూర్చే మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని అన్నారు. అందరూ కలిసిమెలిసి జీవిస్తూ దేశ సమైక్యతను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంకుశావలి, తహసీన్, ఖలీల్, అహ్మద్‌షరీఫ్, కలీమొద్దీన్, ముజ్జు, ఆసీఫ్, మొహియుద్దీన్, ఇర్షాద్, అబ్దుల్ మన్నాన్, సల్మాన్, ముఫ్తీ మౌలానా అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు పాపన్న పేరు పెట్టాలి

- గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణగౌడ్

జనగామ రూరల్: జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ అన్నారు. జనగామ మండల గౌడ సంఘం ఆధ్వర్యాన గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బలి వెంకన్నతో కలిసి మాట్లాడారు. 350 సంవత్సరాల క్రితమే బడుగు బలహీనుల జీవనస్థితి మెరుగుపడాలని, వారు రాజకీయంగా ఎదగాలని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ తపన పడ్డారని పేర్కొన్నారు. జిల్లాకు 'పాపన్న గౌడ్' పేరు పెట్టాలనే డిమాండ్‌తో ఈనెల 21న కలెక్టర్ కార్యాలయం ఎదుట ఒక రోజు రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బహుజన కుల సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నామాల శ్రీనివాస్, పెంబర్తి మాజీ సర్పంచ్ అంబాల ఆంజనేయులు, మెరుగు బాలరాజు, దూడల సిద్ధయ్య, కన్నా పరశురాములు, గద్దం మనోజ్‌కుమార్, మార్క ఉపేందర్, సిద్ధు, నరేందర్, రఘునాథ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

జనగామ రూరల్: మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ 2025–26 విద్యా సంవత్సరానికి మైనారిటీ గురుకుల పాఠశాల కళాశాలల్లో 5 నుంచి 8వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్ అడ్మిషన్ కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిని 9346677568, 9441903130, 9912230123 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

జనగామ రూరల్: మహిళలు చట్టాలను తెలుసుకోవడంతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే ను పురస్కరించుకొని గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన పట్టణంలోని మహాత్మాగాంధీ పూలే ట్రైబల్ వెల్ఫేర్ ఉమెన్స్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పనిచేస్తున్న ప్రదేశంలో పదిమందితో కూడిన ఒక కమిటీ ఉండాలని, అందులో సగం మంది మహిళలు ఉండాలని చెప్పారు. మహిళలకు ఏదైనా సమస్య వస్తే ఆ కమిటీ ముందు రాతపూర్వకంగా చెప్పాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిహారం చట్టం–2013 గురించి వివరించారు. అలాగే వరకట్న నిషేధ చట్టం, వివాహ మహిళ తన భర్త ఇంట్లో ఉండే హక్కు గురించి తెలియజేశారు. ముఖ్యంగా ఆడపిల్లలు పోరాడే శక్తి కలిగి ఉండాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మంచాల రవీంద్ర, అధ్యాపకులు లావణ్య, జి.శివప్రసాద్, ఇందిర, శైలజ, ఉషారాణి, మానస తదితరులు పాల్గొన్నారు.

శుభ ముహూర్తాలకు బ్రేక్

- ఒకేరోజు వందల వివాహాలు
- ఆర్టీసీకి కలెక్షన్లు ఫుల్



బస్సులో సీటుకోసం పోటీపడుతున్న ప్రయాణికులు

జనగామ: జనవరి 31వ తేదీ నుంచి ప్రారంభమైన శుభ ముహూర్తాలకు బ్రేక్ పడింది. నెలన్నరగా శుభకార్యాలు, వివాహాలు, గృహ ప్రవేశాలతో జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. గురువారం చివరి ముహూర్తం నేపథ్యంలో ఒకేరోజు వందలాది వివాహాలు జరిగాయి. ఒక్క జిల్లా కేంద్రంలోనే 50 మంది వధూవరులు మూడుముళ్ల బంధం, ఏడడుగులతో ఒక్కటయ్యారు. ఉగాది పండుగ నుంచి తిరిగి శుభ ముహూర్తాలు ప్రారంభం కానున్నాయి.

ఆర్టీసీకి కాసుల వర్షం..
శుభ ముహూర్తం చివరి రోజు వివాహాలు వేల సంఖ్యలో ఉండడంతో ఆయా ప్రాంతాలకు ప్రయాణించే వారితో ఆర్టీసీ జనగామ డిపోకు టికెట్ కలెక్షన్లు పెరిగాయి. ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు బస్‌స్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ఒక్కో బస్సులో 80 నుంచి 90 మంది ప్రయాణించారు. సీట్ల కోసం పోటీపడ్డారు. పిల్లలు, వృద్ధులు, మహిళలకు ఇబ్బందులు తప్పలేదు.

బీజేపీ విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

జనగామ రూరల్: బీజేపీ రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలుపొందిన సందర్భంగా ఆ పార్టీ ఆధ్వర్యాన గురువారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ మాట్లాడుతూ.. ఈ విజయం ఘనత ఉపాధ్యాయులు, మేధావులు, ప్రజలకే దక్కుతుందని చెప్పారు. తెలంగాణలో నిజమైన ప్రత్యామ్నాయం బీజేపీ అని ఈ ఎన్నిక ద్వారా రుజువైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పజూరి లక్ష్మీనర్సయ్య, ఉడుగుల రమేశ్, అనిల్, శశిధర్‌రెడ్డి, హరిశ్చంద్ర గుప్తా, దేవర ఎల్లయ్య, పెద్దోజు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మినీ డెయిరీ యూనిట్లను వినియోగించుకోవాలి

- జిల్లా పశువైద్యాధికారి రాధాకిషన్

స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన మినీ డెయిరీ యూనిట్లను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రాధాకిషన్ అన్నారు. మండల పరిధి వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు స్థానిక పశువైద్యశాలలో మెడికల్ కిట్లను గురువారం పంపిణీ చేసి మాట్లాడారు. తాటికొండకు 5 యూనిట్లు, మీదికొండ, ఛాగల్లు, పాంనూర్, నమిలిగొండ గ్రామాలకు ఒక్కో యూనిట్ మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ ఏడీ డాక్టర్ చక్రధర్, మండల పశువైద్యాధికారి డాక్టర్ మౌనిక పాల్గొన్నారు.

కవలల పెళ్లి సందడి

దేవరుప్పుల : మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన ఓ కవలల పెళ్లి సందడి గురువారం ప్రత్యేకతను సంతరించుకుంది. సీతారాంపురం గ్రామానికి చెందిన కవలలు (అన్నదమ్ములు) శ్రీకాంత్, సుకన్య, శ్రీనివాస్, మానసల వివాహం రెండు నిమిషాల తేడాతో జనగామలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఒకే వేదికపై నిర్వహించారు.


కవల దంపతులు

ఖండాంతరాలు దాటిన ప్రేమ

- ఒక్కటైన కొలంబియా యువతి, కేసముద్రం యువకుడు


కొలంబియా యువతి రియాను పెళ్లి చేసుకుంటున్న కేసముద్రం యువకుడు సాయిచైతన్య

కేసముద్రం : కొలంబియా యువతి, కేసముద్రం యువకుడు ప్రేమించుకుని పెద్దల అంగీకారంతో ఒక్కటయ్యారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్‌కి చెందిన సాయిచైతన్య ఆస్ట్రేలియాలో ఓ కంపెనీలో ఈవెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కొలంబియా దేశానికి చెందిన రియా అదే కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తోంది. ఇద్దరు ప్రేమించుకుని పెద్దలను ఒప్పించారు. వారి అంగీకారంతో గురువారం కేసముద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో హిందూ సంప్రదాయ పద్ధతిలో ఒక్కటయ్యారు.

రాములోరికి 'గోటి తలంబ్రాలు'

- చేతిగోళ్లతో ఒక్కో వరి గింజను ఒలిచి..
- నవమి నాటికి అక్షింతల బియ్యం సిద్ధం

హన్మకొండ కల్చరల్ : రాములోరి కల్యాణం.. కమనీయం.. రమణీయం..చూసిన కనులదే భాగ్యం.. భద్రాద్రిలో జరిగే వేడుకను తిలకించి..తరించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. వీరిలో ఓరుగల్లు మహిళలు పరిణయ వేడుకకు తలంబ్రాలను సిద్ధం చేయడానికి వరిగింజలను గోటితో ఒలిచి తమ భక్తిభావాన్ని చాటుకుంటున్నారు.

గోటి తలంబ్రాలు..

శ్రీరామ నవమి రోజు భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణంలో ఉపయోగించే తలంబ్రాలకు ప్రత్యేకత ఉంది. వడ్ల గింజలను రోలులో దంచడంగాని లేక మిల్లులో మరపట్టించినవి కావు.. మహిళలు చేతిగోళ్లతో ఒక్కొక్క ధాన్యపు గింజను వలచిన బియ్యం. వీటినే గోటి తలంబ్రాలు అంటారు.

ఎంతో పవిత్రంగా..

శ్రీరామనామ స్మరణతో ఎంతో పవిత్రంగా గోటితో తలంబ్రాలు ఒలుస్తారు. ఈ తలంబ్రాల కోసం విత్తనాల వడ్లను ప్రత్యేకంగా సాగు చేస్తారు. శ్రీరాముడి కల్యాణ తంతు జరుగుతున్నప్పుడు తలంబ్రాలతో పాటు సాగుచేయడానికి కావలసిన వడ్లను కూడా స్వామివారి పాదాల వద్ద పెడతారు. ఆ వడ్లనే తిరిగి సాగుచేయడానికి వాడుతారు. వీటిని కొందరు భక్తిభావంతో తమ పొలంలో కొంత భూమిని కేటాయించి సాగు చేస్తుంటారు. ప్రత్యేక ముడుపులుగా చేసి మందులు, ఎరువులు వేయకుండా, కాళ్లతో తొక్కకుండా, పవిత్రంగా పండిస్తున్నారు. వంటపొలాల్లో కంకులను కూడా కత్తులతో కాకుండా శ్రీరామనామం జపిస్తూ చేతిలో వలుస్తారు.


వరి ధాన్యాన్ని గోటితో ఒలుస్తున్న మహిళలు

ధన్యులమయ్యాం..



రాముల వారి కల్యాణంలో ముఖ్యమైన ఘట్టం తలంబ్రాలు.. ఈ అక్షింతలను కోటి తలంబ్రాలుగా చెబుతారు. గోటీ తలంబ్రాల కార్యక్రమంలో భాగస్తులైనందుకు ధన్యులమయ్యాం. - పంతుల సుధామాధురి

కొరియర్ ద్వారా..

వరి ధాన్యాన్ని తలంబ్రాలుగా ఒలిచేందుకు భద్రాచలం నుంచి శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి ప్రతినిధులు కొరియర్ ద్వారా పంపగా వరంగల్ బ్యాంక్‌కాలనీలోని ఏలిషాల సుజాత అందుకున్నారు. ఈ ధాన్యాన్ని కాలనీ మహిళలు నిత్యం నిష్ఠతో ఉండి భక్తిశ్రద్ధలతో శ్రీరామ కీర్తనలు ఆలపిస్తూ, శ్రీరామ స్మరణ చేస్తూ గోటితో ఒలిచి.. తలంబ్రాలుగా తయారు చేస్తున్నారు. ఈ నెల 8న శనివారం ఒలిచిన తలంబ్రాలను కొరియర్ ద్వారా భద్రాచలం రాములవారికి పంపిస్తారు. సీతారాముల కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం చేయడం అత్యంత పవిత్రంగా భావిస్తున్నామని మహిళలు చెబుతున్నారు.

మా ఇంట్లోనే తలంబ్రాలు చేస్తాం..



ఫిబ్రవరి 15న భద్రాచలం నుంచి 2 కిలోల వడ్లను అందుకుని వలిచే కార్యక్రమాన్ని మా ఇంట్లో ప్రారంభించాము. ఈ నెల 8న శనివారం ఒలిచిన బియ్యాన్ని భద్రాచలానికి పంపిస్తాం. శ్రీసీతారాముల వారి విగ్రహాలను ప్రతిష్ఠించుకుని నియమ నిష్ఠలతో కాలనీ మహిళలతో కలిసి ఒలిచే కార్యక్రమం మా ఇంట్లో తలంబ్రాలుగా తయారు చేయడం సంతోషంగా ఉంది.

- ఏలిషాల సుజాత, బ్యాంక్‌కాలనీ, వరంగల్

ఆనందంగా ఉంది



శ్రీరామ నామాన్ని స్మరిస్తూ భక్తిభావంతో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉంది. భగవంతుని సేవ చేయడం వల్ల మాకు మంచి జరుగుతుందనే భావన. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తోటి మహిళలతో స్నేహబంధాలు పెరుగుతాయి.

- లావణ్య, బ్యాంక్‌కాలనీ, వరంగల్

ఆర్టీఏపై విజిలెన్స్ నిఘా

- తరచూగా ఆకస్మిక పరిశీలన, తనిఖీలు


వరంగల్ రవాణాశాఖ కార్యాలయం

ఖిలా వరంగల్ : వరంగల్ రవాణా శాఖ కార్యాలయంలో వాహనదారులకు అందించే సేవలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రత్యేక నిఘా వేశారు. అధికారుల పనితీరు, వాహనదారులకు అందించే సేవలపై రహస్యంగా పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా వరంగల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ బాలకోటి ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ రవాణాశాఖ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీరో కౌంటర్ల వద్ద అందజేస్తున్న సేవలు, వాహన ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్ విధానం, ఆన్‌లైన్ డ్రైవింగ్ పరీక్షలను స్వయంగా పరిశీలించారు. అనంతరం జీరో కౌంటర్లలో సోదాలు చేసిన అధికారులు ఇన్‌చార్జ్ ఆర్టీఓ శోభన్ బాబును కలిసి సేవలకు సంబంధించిన కొన్ని పత్రాలను అడిగి తీసుకున్నారు. దళారుల కార్యాలయాల్లో ఏమైనా వాహనదారులకు చెందిన ఫైల్స్ ఉన్నాయా.. అనే దానిపై ఆరా తీశారు. అధికారుల పనితీరు, రవాణాశాఖ అందజేస్తున్న సేవలపై ప్రత్యేక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పెళ్లి వద్దని ఆత్మహత్యాయత్నం

- మానుకోట ఎస్సై సమాచారంతో కాపాడిన కాజీపేట జీఆర్పీ అధికారులు
- తండ్రికి విద్యార్థిని అప్పగింత


తండ్రికి విద్యార్థినిని అప్పగిస్తున్న జీఆర్పీ కానిస్టేబుల్ కమలాకర్

కాజీపేట రూరల్ : పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని ఓ విద్యార్థిని కాజీపేట జంక్షన్ రైల్వే యార్డులో గురువారం తెల్లవారు జామున ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు అదుపులోకి తీసుకోని ఆమె తండ్రికి అప్పగించిన సంఘటన కాజీపేటలో జరిగింది. జీఆర్పీ కానిస్టేబుల్ ఆర్.కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లాకు చెందిన నందిని హాస్టల్‌లో ఉంటూ బీటెక్ చదువుతోంది. ఇంటికి వచ్చిన నందినికి పెళ్లి చేస్తానని చెప్పడంతో తల్లి కూతుళ్ల మధ్య గొడవ జరిగింది. పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని నందిని బుధవారం ఇంటి నుంచి వచ్చి కాజీపేట రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అదే రోజు రాత్రి నందిని కాజీపేటలో ప్రయాణికుడి సెల్‌ఫోన్ నుంచి తండ్రికి ఫోన్ చేసి కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఉన్నానని, రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పింది. అప్రమత్తమైన తండ్రి మహబూబాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సమాచారంతో కాజీపేట జీఆర్పీ పోలీసులు రైల్వే యార్డు ఆర్ఆర్ఐ సమీపంలో ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధంగా ఉన్న నందినిని గుర్తించి అదుపులోకి తీసుకోని జీఆర్పీ స్టేషన్‌కు తరలించారు. తండ్రిని పిలిపించి జీఆర్పీ అధికారుల ఆదేశాలనుసారం నందినిని తండ్రి అప్పగించినట్లు ఆయన తెలిపారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు, జరిమానా

మడికొండ : మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి కోర్టు జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం .. కాజీపేట మండలం రాంపేట గ్రామానికి చెందిన మీరాల రాజు 2017, జూలై 22న సాయంత్రం అదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. అప్పటి ఎస్సై మధుప్రసాద్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, విచారణలో భాగంగా గురువారం కానిస్టేబుల్ వి.రాజేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టాడు. ప్రాసిక్యూషన్ తరఫున ఎస్.దుర్గబాయ్ వాదించగా నిందితుడిపై నేరం రుజువైంది. దీంతో హనుమకొండ మొదటి అదనపు న్యాయమూర్తి చింతాడ శ్రావణ స్వాతి నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.6,000ల జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యం..ట్రాలీ బోల్తా

- వాహనంలో 37మంది కూలీలు
- ఒకరి మృతి, ఇద్దరి పరిస్థితి విషమం
- కోనాపురం శివారులో ఘటన


బానోత్ సుక్య మృతదేహం

చెన్నారావుపేట : డ్రైవర్ నిర్లక్ష్యంతో ట్రాలీ వాహనం బోల్తా పడిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని కోనాపురం శివారులో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జీడిగడ్డ తండాకు చెందిన 37 మంది వ్యవసాయ కూలీలను ఇటుకాలపల్లి శివారు ఇప్పల్ తండాకు చెందిన ధరావత్ మైబూ మిర్చి ఏరేందుకు కూలీలను తీసుకు రమ్మని జీడిగడ్డ తండాకు చెందిన భూక్య సమ్మికి చెప్పాడు. బానోత్ సుక్యతో పాటు 37 మందిని కూలీలను తీసుకోని గూడ్స్ వాహనంలో గురువారం ఉదయం ఇప్పల్ తండాకు బయలుదేరారు. గార్లగడ్డ తండాకు చెందిన ట్రాలీ డ్రైవర్ అజ్మీరా సంతోష్ వాహనాన్ని అతివేగంగా నడపడంతో పాటు ఎక్కువ మంది ఉండడం వల్ల కోనాపురం శివారులో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న 37 మంది కూలీలు కింద పడ్డారు. అందులో కొందరికి తీవ్ర గాయాలు, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోతరాజు రాజు, పున్నం నర్సయ్య వెంటనే 108తో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజేష్‌రెడ్డిలు చేరుకుని క్షతగాత్రులను నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో బానోత్ సుక్య (55) మృతిచెందాడు. బానోత్ ఈర్య, ఆంగోత్ జమ్లి, నూనావత్ అంబాలి, బానోత్ బుజ్జి, సంపుతోపాటు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉన్నవారిని ఎంజీఎంకు తరలించారు. మృతుడి కుమారుడి మోహన్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు.


క్షతగాత్రుల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బతికి బయట పడ్డా..



నర్సంపేట మండలం ఇప్పల్‌తండాకు చెందిన రైతు పంపిన వాహనంలోనే మిర్చి ఏరడానికి వెళ్లాను. వాహనం స్పీడ్‌గా వెళ్తుంది. ఒక్కసారి కోనాపురం శివారులో బోల్తా పడింది. కొద్దిసేపు ఏం జరిగిందో అర్థం కాలే. చాలా మందికి దెబ్బలు తగిలాయి. నాకు స్వల్పంగా గాయాలయ్యాయి.ఆ ప్రమాదం చూస్తే చనిపోయాననుకున్నా. దేవుడు మరో జన్మనిచ్చాడు.

- బానోత్ అరుణ, ట్రాలీలో ఉన్న కూలీ

కళ్ల ముందే బోల్తా పడింది..



కూలీలతో వెళ్తున్న వాహనం బోల్తాపడిన సమీపంలోనే నా వ్యవసాయ భూమి ఉంది. పంటకు నీళ్లు పెట్టి బయటికి వచ్చాను. చూస్తుండగానే అదుపుతప్పి వాహనం బోల్తా పడింది. వెంటనే అక్కడికి వెళ్లి వాహనంలో ఉన్న వారి సాయంతో అందరిని బయటికి తీశాం. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగింది.

- పున్నం నర్సయ్య, ప్రత్యక్ష సాక్షి

తప్పిన పెను ప్రమాదం..

వాహనం బోల్తా పడిన ప్రదేశంలో పెద్ద బండరాయి ఉంది. ఒకవేళ వాహనం బండరాయి పై పడి ఉంటే మరికొందరు మృత్యువాత పడేవారని స్థానికులు చెబుతున్నారు.

భళా.. ఇత్తడి హస్తకళ

- రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేక గుర్తింపు
- వరంగల్‌కు దక్కిన గౌరవంపై ప్రశంసలు
- ప్రత్యేక ఆకృతులతో ఆకట్టుకుంటున్న స్టాల్

సాక్షి, వరంగల్ : వరంగల్ జిల్లా రంగశాయిపేట ఇత్తడి హస్తకళకు దేశ రాజధానిలో ప్రత్యేక గుర్తింపు దక్కుతోంది. కాకతీయుల కాలం నాటి వెండి నగిషీలు తయారుచేసే పెంబర్తి హస్తకళకు దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు ఉంటే.. వాటి సరసన రంగశాయిపేట ఇత్తడి హస్తకళ పోటీపడుతోంది. అమృత్ మహోత్సవ్‌లో భాగంగా న్యూఢిల్లీలోని రాష్ట్రపతి నిలయంలో బుధవారం నుంచి జరుగుతున్న దక్షిణ భారత ఎగ్జిబిషన్‌లో రంగశాయిపేట ఇత్తడి హస్తకళ స్టాల్‌కు చోటు లభించింది. ఓ వైపు సాంస్కృతిక ప్రతిరూపాలను తెలిపే డిజైన్లు, మరోవైపు నేటి కాలానికి తగ్గట్టుగా మోడ్రన్ డిజైన్ విత్ ఎంబోజింగ్ వర్క్ ద్వారా విభిన్న హస్తకళ డిజైన్లు చేస్తుండడంతో వీటికి ప్రత్యేక గుర్తింపు లభించింది. నాబార్డు, డీసీహెచ్ మద్దతుతో వందలాది కుటుంబాలకు ఈ హస్తకళ నైపుణ్యంపై శిక్షణ ఇచ్చి భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా రంగశాయిపేట ఇత్తడి హస్తకళ బంధం ముందుకెళ్తోంది. 'రాగి లేదా ఇత్తడి లోహన్ని సన్నని షీట్లుగా కొట్టి, చక్కటి తీగగా కట్ చేస్తాం. చెక్క ఉపరితలంపై గుర్తించబడిన డిజైన్‌ను సుత్తి, ఉలి సాయంతో కోస్తాం. ఇత్తడి లేదా రాగి తీగను డిజైన్‌తో చెక్కబడిన భాగంలోకి సుత్తితో గుచ్చుతాం. ఆ తర్వాత రంపంతో కత్తిరించి డిజైన్‌లో కావల్సిన ప్రదేశాలలో జిగురుతో బిగిస్తాం. అత్యాధునిక పద్ధతులతో వివిధ డిజైన్లతో వస్తువులను తయారు చేస్తున్నాం. ఇంటిరియర్ వర్క్‌లో ఫ్లవర్ వాజెస్, వాల్ ప్యానెల్స్, డోర్ ప్యానెల్స్ చేస్తున్నాం.అలాగే దేవాలయం, దేవుళ్ల ఫొటోలతో కూడా ఎంబోజింగ్ వర్క్‌తో అది కూడా చేతి ద్వారా చేయడంతో ఆయా బొమ్మల ఆకారం స్పష్టంగా కనబడుతుంద'ని రంగశాయిపేట ఇత్తడి హస్తకళ బృంద సభ్యుడు ప్రణయ్ గురువారం 'సాక్షి'కి వివరించారు. అలాగే వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. రంగశాయిపేట ఇత్తడి హస్తకళలకు రాష్ట్రపతి నిలయంలో జరిగిన అమృత్ మహోత్సవ్ ఎగ్జిబిషన్ లో చోటు దక్కడం జిల్లాకు దక్కిన గుర్తింపు. మరోసారి చేతికళలకు నిలయమని దేశమంతటా తెలిసింది. ఈ హస్త కళాకారులు భవిష్యత్‌లో ఇత్తడితో విభిన్న డిజైన్లు చేసి ఆర్థికాభివృద్ధి చెందడంతో పాటు జిల్లాకు మంచి గుర్తింపు వచ్చేలా పనిచేయాలని ఆకాంక్షించారు.


న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన రంగశాయిపేట హస్తకళ స్టాల్

శరవేగంగా భూ సర్వే

- సర్వేకు రైతుల సుముఖత
- ఎయిర్ పోర్ట్ రన్‌వేకు 253 ఎకరాల భూమి సేకరణ


సర్వే చేస్తున్న తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, సిబ్బంది

ఖిలా వరంగల్ : మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. భూ సర్వేకు రైతుల సైతం సుముఖంగా ఉన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 253 ఎకరాల భూ సేకరణకు రూ.205 కోట్ల నిధుల విడుదల చేసింది. కలెక్టర్ ఆదేశాలతో గురువారం తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నక్కలపల్లి, గాడిపల్లి గ్రామ శివారులో శరవేగంగా భూ సేకరణకు సర్వే చేపట్టారు. రైతుల సహకారంతో తొలిరోజు 170 ఎకరాల భూ సర్వే చేసి హద్దులు గుర్తించారు. అనంతరం భూ నిర్వాసితుల నుంచి వ్యక్తిగత వివరాలను సేకరించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల సహకారంతో తొలిరోజు నక్కలపల్లి-47, గాడిపల్లి శివారు పరిధిలో 123, మొత్తం 170 ఎకరాలు సర్వే చేశామని తెలిపారు. మిగిలిన 83 ఎకరాల భూమి మరో మూడ్రోజుల్లో పూర్తి చేసి సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అనంతరం సర్వేకు సహకరించిన రైతులకు తహసీల్దార్ నాగేశ్వర్‌రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సర్వేలో ఆర్ఐ ఆనంద్‌కుమార్, సర్వేయర్ రజిత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కుమారుడిని ఎస్సై అకారణంగా తిట్టాడని..

- పొలంవద్ద పురుగుల మందుతాగిన తండ్రి
- వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై కుటుంబ సభ్యుల ధర్నా
- ఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండ్


పురుగుల మందు తాగిన మల్లునాయక్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

రాయపర్తి: న్యాయం చేయాలని స్టేషన్‌కు వస్తే ఎస్సై.. తమ కుమారుడిని అకారణంగా తిట్టాడంటూ ఓ తండ్రి వ్యవసాయపొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఎస్సై శ్రవణ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలంటూ ఆ రైతు కుటుంబ సభ్యులు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బాధితులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఎర్రకుంటతండా గ్రామానికి చెందిన భూక్య మల్లునాయక్ తనకున్న మూడున్నర ఎకరాల్లో వరి సాగు చేశాడు. తన పక్కనే ఉన్న మరో రైతు సపావత్ ద్వాల్యానాయక్ గతంలో తన భూమిలో బోరు వేయించుకున్నప్పుడు భవిష్యత్‌లో మల్లు బోరు వేసుకున్నా అభ్యంతరం చెప్పనని ఒప్పంద పత్రం రాసి ఇచ్చాడు. యాసంగి వరిసాగు చేస్తున్న క్రమంలో భూక్యా మల్లునాయక్‌కు చెందిన వరిపంట ఎండిపోతుండడంతో బోరు వేయించేందుకు బోరుబండిని తీసుకు వచ్చాడు. వేరేచోట వేయించుకోవాలంటూ ద్వాల్యా నాయక్ కుటుంబం బోరుబండిని పంపించారు. దీంతో ఆగ్రహానికి గురైన భూక్య మల్లునాయక్, కుటుంబ సభ్యులతో కలిసి ద్వాల్యా నాయక్‌కు చెందిన బోరు స్టార్టర్‌ను తీసుకు వచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో మల్లునాయక్‌తో వచ్చిన తన కుమారుడిని ఎస్సై 'ఏం చదువుకున్నవు' అంటూ ఇష్టమొచ్చిన బూతులు తిడుతూ 'నువ్వు చస్తే చావు నాకేం సంబంధం' అనడంతో ఆవేశానికి లోనైన మల్లునాయక్ తన వ్యవసాయ పొలానికి చేరుకొని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మల్లునాయక్ కుటుంబ సభ్యులు రాయపర్తిలోని పోలీస్ స్టేషన్ ఎదుట వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఎస్సై శ్రవణ్‌కుమార్ తనను అకారణంగా బూతులు తిట్టాడని తండ్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, ఎస్సైని సస్పెండ్ చేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించడంతో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. వర్ధన్నపేట, జఫర్‌గడ్ ఎస్సైలు చందర్, రామ్‌చరణ్‌లు ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినప్పటికి వినలేదు. ఎస్సైని సస్పెండ్ చేస్తేనే ఇక్కడి నుంచి వెళ్తామని పట్టుబట్టారు. చీకటిపడే వరకు వారంతా అక్కడే ఉన్నారు. ఎస్సైని సస్పెండ్ చేయాలని నేడు (శుక్రవారం) కూడా ఆందోళన చేస్తామని అక్కడినుంచి వెళ్లిపోయారు.

గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సర్వయ్య

మహబూబాబాద్ రూరల్ : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 10 కిలోల 102 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ పి.సర్వయ్య తెలిపారు. పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సర్వయ్య కేసు వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని గంజాం జిల్లా బడఖరిడకు చెందిన బరున బరడ్ సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఒడిశాలోని ఒకరివద్ద నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేశాడు. సూరత్‌లో అధిక ధరకు విక్రయించేందుకు విజయవాడ మీదుగా వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేస్తున్నారని తెలుసుకుని మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగాడు. తొర్రూరు మీదుగా వరంగల్ వెళ్లేందుకు ఆటో ఎక్కి వెళ్తుండగా శనిగపురం వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా ఆటోదిగి పారిపోయే ప్రయత్నం చేశాడు. అతడిని పట్టుకుని, 10 కిలోల 102 గ్రాముల (రూ.5.05 లక్షల విలువగల) ఎండు గంజాయి, మొబైల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్సై దీపిక, ట్రెయినీ ఎస్సై నరేష్, ఏఎస్సై జాకీర్, సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న సీఐ, ఎస్సై, సిబ్బందిని ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ అభినందించారు.

రూ.1,42లక్షల విలువైన గంజాయి..

నడికూడ : మండలంలోని చర్లపల్లి వద్ద నిషేధిత గంజాయిని గురువారం స్వాధీనం చేసుకున్నారు. పరకాల ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బస్టాండ్ వద్ద స్కూటీపై ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని ఆపి తనిఖీ చేయగా 2.840 కేజీల గంజాయి రవాణా చేస్తు పట్టుబడ్డారు. అదుపులో తీసుకొని విచారించగా ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా, చిత్రకొండ నాగులూర్‌కు చెందిన పప్పల్ బాలయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచకు చెందిన ముదిగొండ ప్రశాంత్ పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1,42 లక్షల వరకు ఉంటుందని, నిందితులను అదుపులోకి తీసుకొని, పరకాల పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.